సాక్షి చిత్తూరు

శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



మురిసిన ముంగిళ్లు

జిల్లాలో మొదటిసారిగా టిడ్కో ఇళ్లు పుంగనూరులో ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం సర్వం సిద్ధం చేశారు. - 8లో



ఇన్‌స్పైర్‌లో మూర్తిభవించిన సృజన


జాతీయస్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థి మూర్తి చేతన్ అవార్డు సాధించాడు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	33	22
తిరుపతి	34	22
తిరుమల	30	18
గూడూరు	35	24
నగరి	34	23

న్యూస్‌రీల్

అధునాతనంగా ఆర్డీఓ కార్యాలయం

– నేడు మంత్రి పెద్దిరెడ్డిచే ప్రారంభం



ఆర్డీఓ కార్యాలయం నూతన భవనం

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులో అధునాతన హంగులతో రెవెన్యూ డివిజన్ కార్యాలయ భవనాన్ని నిర్మించారు. స్వాతంత్య్రం రాక ముందు 1907లో నిర్మించిన భవనంలో ఇప్పటి వరకు కార్యకలాపాలు నిర్వహించారు. భవనం శిథిలావస్థకు చేరడంతో అదే ప్రాంగణంలో రూ.2.25 కోట్లతో కొత్త భవనాన్ని నిర్మించారు. ఆర్డీవో చాంబర్, ఏవో చాంబర్, సిబ్బందికి ప్రత్యేక విభాగాలు, సమావేశ మందిరం, వీడియో కాన్ఫరెన్స్ హాల్ నిర్మించారు. ఈ భవనాన్ని శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగర మేయర్ అముద, కలెక్టర్ షణ్మోహన్, జేసీ శ్రీనివాసులు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారు. ముందస్తు ఏర్పాట్లను గురువారం ఆర్డీవో రేణుక, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు.

జిల్లాకు చేరిన విద్యుత్ పరికరాలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో జిల్లా స్టోర్‌కు విద్యుత్ పరికరాలు చేరాయని ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. వాణిజ్య, పరిశ్రమ సర్వీసులకు వినియోగించే 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు వంద వచ్చాయని పేర్కొన్నారు. వీటితో కండక్టర్ వైర్లు వచ్చాయన్నారు. సంబంధిత ఏఈలు వర్క్ఆర్డర్లు పెట్టి మెటీరియల్ డ్రా చేసుకోవాలని వివరించారు.

నవంబరులో ఎస్‌పీఎం ప్రారంభం

నూతన ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం (ఎస్‌పీఎం) నవంబరులోపు ప్రారంభించనున్నట్లు డీఈ ఆనంద్ తెలిపారు. పాత కాంట్రాక్టర్ పనుల విషయంలో నిర్లక్ష్యంగా ఉండడంతో కొత్త కాంట్రాక్టర్‌ను ఉన్నతాధికారులు నియమిస్తున్నారని పేర్కొన్నారు. మర మ్మతుల కేంద్రం భవన నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయని కాంపౌండ్ వాల్, ఫిల్లర్లు నిర్మించాల్సి ఉందన్నారు. ఆ పనులు పూర్తయ్యాక కార్యాలయాన్ని మార్పు చేస్తామని తెలిపారు.

నెట్‌బాల్ రాష్ట్ర పోటీలకు ఎంపిక





సోనియా, హేమ

బంగారుపాళెం: స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు మండలంలోని రాగిమానుపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం హెచ్‌ఎం సుజాత మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా చిన్నతిప్పసముద్రంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారని తెలిపారు. అండర్–14 బాలికల విభాగంలో 8వ తరగతి విద్యార్థిని సోనియా, అండర్–17 విభాగంలో 9వ తరగతి విద్యార్థిని హేమ ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది.

పెద్దకాప్పల్లెలోనే గజరాజుల మకాం



పెదకాప్పల్లెలో ఏనుగులు తొక్కేసిన వరి పంట

పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాప్పల్లె పంచాయతీ అటవీ ప్రాంత సరిహద్దు గ్రామాల్లో గజరాజులు మకాం వేసి ఉన్నాయి. అకులవారిపల్లె, గౌరీనగర్, జిట్టంవారిపల్లె, ముదిరెడ్డిపల్లె, పెద్దకాప్పల్లె, పెనుగొలకల, తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లెలో పంటలపై ఏనుగుల గుంపు పదే పదే చొరబడుతూ పంటలకు తీవ్రంగా నష్టం కలిగిస్తున్నాయి. బుధవారం రాత్రి కీలపట్ల ఫారెస్టు బీటు నుంచి వచ్చిన ఏనుగులు పెద్దకాప్పల్లెకు చెందిన సురేంద్రరెడ్డి, మరికొందరి రైతుల వరి పంటను తొక్కి నాశనం చేశాయి. రైతు రమణారెడ్డి అరటితోటపై విరుచుకపడి ధ్వంసం చేశాయి. గురువారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు ధ్వంసమై ఉండడాన్ని గుర్తించారు. రూ.50 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. సమాచారం అందుకున్న రాయలపేట, చారాల ఫారెస్టు బీట్ ఆఫీసర్లు రవికుమార్, దొరస్వామి ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.



పక్కాగృహం ప్రారంభిస్తున్న మంత్రి రోజా



కాయం లేఅవుట్ ప్రారంభోత్సవంలో మంత్రి రోజా, ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

జగనన్న అనుగృహం

'సొంతిల్లుకట్టుకుని, అందులో కుటుంబంతో హాయిగా జీవించాలన్నది సగటు మనిషి కల. వారి కల నెరవేర్చాలని భావించారు జగనన్న. అందుకే ప్రభుత్వ నిధులతో పేదలకు సొంతింటి స్వప్నం నెరవేర్చారు. గురువారం ఆ ఇళ్లను పేదలకు పంపిణీ చేశాం. సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించాం.' అని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు.

- పేద అక్కచెల్లెమ్మల చేతుల్లో రూ.3 లక్షల కోట్ల సంపద
- జిల్లాలో 92,700 ఇళ్లు మంజూరు
- ప్రస్తుతానికి 31,700 ఇళ్లు పూర్తి
- కాయంలో 420 ఇళ్ల సామూహిక గృహప్రవేశాలు
- పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: రాష్ట్రంలోని లక్షలాది మంది పేద అక్క చెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదరిల్లులాంటి గృహాలను నిర్మించి ఇచ్చారని, రూ.3 లక్షల కోట్ల సంపదను వారి చేతుల్లో పెట్టారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖా మంత్రి ఆర్కే రోజా తెలిపారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గురువారం వడమాలపేట మండలం కాయం వద్ద జగనన్న లేఅవుట్‌లో నిర్మించిన 420 గృహాలను మంత్రి ఆర్కే రోజా, ఎంపీ రెడ్డెప్ప, తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డితో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి రోజా మాట్లాడుతూ ప్రతి పేదింటి మహిళ చిరకాల స్వప్నం అయిన సొంతింటిని అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటి స్థలం, ప్రాంతం ఆధారంగా కనీసం రూ.2.50 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఉంటుందని, స్థలాన్ని ఉచితంగా ఇవ్వడంతోపాటు రూ.1.80 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారన్నారు. అంతే కాకుండా పావలా వడ్డీకే రూ.35 వేల చొప్పున బ్యాంకు రుణాలను అందించడం, ఉచితంగా ఇసుక, తక్కువ ధరలకే నిర్మాణ సామగ్రిని అందించి, మరో రూ.40 వేల మేరకు లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. మొత్తం మీద ఒక్కో ఇంటిని రూ.2.70 లక్షలతో నిర్మించారని చెప్పారు. లేఅవుట్లలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సెంటర్లు తదితర మౌలిక వసతులను కల్పించి, మోడ్రన్ కాలనీలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గత చంద్రబాబు ప్రభుత్వానికి, నేటి జగనన్న ప్రభుత్వానికి తేడాను గమనించాలన్నారు. ఆ తేడా ఆమె మాటల్లోనే..



జగనన్న పక్కా ఇంటి ముందు ఉన్న మంత్రి రోజా, ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

గత ప్రభుత్వంలో అలా..

- ఇల్లు లేని నిరుపేదలు పెద్ద సంఖ్యలో ఉన్నా కనీసం ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్న ఆలోచన చేయలేదు.
- టిడ్కో ఇళ్ల పేరిట పేదల నుంచి రూ.కోట్లు వసూలు చేసి, వాటిని పూర్తి చేయకుండా వదిలేశారు. మౌలిక వసతుల ఊసే లేదు.
- ఎన్నికల ముందు నామమాత్రంగా ఇళ్లు మంజూరు అంటూ నాటకాలు.
- వాటి కోసం జన్మభూమి కమిటీ నాయకుల ముందు మోకరిల్లాల్సిన దుస్థితి.

జగనన్న ప్రభుత్వంలో ఇలా..

- రాష్ట్రవ్యాప్తంగా 30.75 లక్షల ఇళ్ల పట్టాల పంపిణీ.
- రూ.76 వేల కోట్లతో 17,005 లేఅవుట్లలో వైఎస్సార్–జగనన్న కాలనీల ఏర్పాటు.
- 21.76 లక్షల ఇళ్ల నిర్మాణాలు, ఇప్పటికే 7.43 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి, పేద మహిళలకు అందజేత.
- కేవలం ఒక్క రూపాయికే సర్వహక్కులతో 300 చదరపు అడుగుల టిడ్కో ఇళ్ల పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకటేశ్వర రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్సీ విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు యాదవేంద్రరెడ్డి, కరుణాకర్‌చౌదరి, విజయలక్ష్మి, రేణుక, కుసుమ, కిరణ్, చంద్రారెడ్డి, రామిరెడ్డి, శేఖర్, మునిబాబు, సుధీర్‌రెడ్డి, నందయ్య, సురేష్‌రాజు, మునిశేఖర్, గాంధీ పాల్గొన్నారు.

జగనన్న దేవుడు



నాకు పెళ్లి అయిన నాటి నుంచి అద్దె ఇంట్లోనే ఉన్నా. నా భర్త కూలీ. మాకు సొంతిల్లు అనేది ఓ కలగా ఉండేది. జగనన్న చలవతో నాకు పట్టా ఇచ్చి స్థలం చూపించారు. ఇల్లు కట్టుకోవడానికి డబ్బిచ్చి ప్రోత్సహించారు. రూ.6 వేలు వరకు అద్దె చెల్లిస్తున్న నేను ఈ రోజు సొంతింటిలోకి రావడం జగనన్న మాకు ఇచ్చిన గొప్ప బహుమతి. జగనన్న మాకు దేవుడిచ్చిన అన్న. ఆయన రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిది. ఆయన మళ్లీ సీఎం కావాలన్నదే మా కోరిక.

– ఎం.లత, కల్లూరు గ్రామం, వడమాలపేట మండలం

మంత్రి రోజమ్మ ప్రోత్సాహం మరువలేం



మంత్రి రోజమ్మ ప్రోత్సాహంతో ఇల్లు పూర్తి చేసుకోగలిగాను. ఆమె అప్పుడప్పుడు వచ్చి మమ్మల్ని ఇంటి నిర్మాణం పనులు ఆలస్యం చేయవద్దని సూచించేది. ప్రభుత్వం నుంచి ఇసుక, ఇతర సామగ్రి తక్కువ ధరకు ఇప్పించింది. ఇంటి పట్టా ఇచ్చినప్పటి నుంచి ఇల్లు పూర్తయ్యే వరకు ఆమె మాకు అండగా నిలిచారు. జగనన్న ప్రభుత్వంలో పేదల సొంతింటి కల నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉన్నాం. నా భర్త సురేష్ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. ఏమీలేని చంద్రలేఖ నేడు రూ.పది లక్షల ఆస్తిపరురాలైంది.

– ఎస్.చంద్రలేఖ, ఓబీఆర్ కండ్రిగ, వడమాలపేట మండలం

పకడ్బందీగా పాల వెల్లువ సర్వే

- నవంబర్ నుంచి అమూల్ పాల సేకరణ
- జిల్లా కలెక్టర్ షణ్మోహన్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈనెల 13 నుంచి జగనన్న పాలవెల్లువ రెండవ విడత సర్వే పకడ్బందీగా చేపట్టాలని, సర్వే అనంతరం నవంబర్ 4వ వారం నుంచి అమూల్ సంస్థ పాల సేకరణ ప్రారంభిస్తుందని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం పశు సంవర్థకశాఖ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 11 మండలాల్లో 107 ఆర్‌బీకేల పరిధిలో సర్వే నిర్వహించాలని చెప్పారు. జగనన్న పాలవెల్లువ మొదటి విడతలో పైలెట్ ప్రాజెక్టు వి.కోట, శాంతిపురం, రామకుప్పం మండలాల్లోని 101 గ్రామాల్లో ప్రారంభమైందన్నారు. రెండవ విడత పాల సేకరణకు తవణంపల్లె, ఐరాల, బంగారుపాలెం, బైరెడ్డిపల్లె, పలమనేరు, పూతలపట్టు, కార్వేటినగరం, నగరి, నింద్ర మండలాల్లో ఈనెల 13 నుంచి సర్వే ప్రారంభం కావాలని తెలిపారు. జిల్లాలో పాల ఉత్పత్తి పుష్కలంగా ఉన్న గ్రామాల్లో మెంటర్లు, రూట్ ఇంచార్జ్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ల ద్వారా ఏఎంసీయూలను గుర్తించి, భవనాలను సిద్ధంగా ఉంచాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఏఎంసీయూల్లో అవసరమైన సాఫ్ట్‌వేర్‌లను సిద్ధం చేసుకుని పాడి రైతుల వివరాలను నమోదు చేయాలన్నారు. గ్రామ స్థాయిలో సెక్రెటరీ, అసిస్టెంట్ సెక్రెటరీలకు శిక్షణ ఇచ్చి పని తీరును పర్యవేక్షించాలని డ్వామా పీడీ గంగా భవానిని ఆదేశించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, పశుసంవర్థక శాఖ డీడీ ప్రభాకర్, జిల్లా డెయిరీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రవిచంద్రన్, డీసీవో బ్రహ్మానందరెడ్డి, అమూల్ సంస్థ ప్రతినిధి నవీన్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

పక్కాగా బడిఈడు పిల్లల వివరాలు

చైల్డ్ ఇన్ఫో వెబ్‌సైట్‌లో బడిఈడు పిల్లల వివరాలను పక్కాగా నమోదు చేయాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. విద్యాశాఖ అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడుతూ బడిఈడుపిల్లలందరూ బడిలోనే ఉండేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. వలంటీర్ల సర్వే పూర్తయిన వెంటనే బడిఈడు పిల్లల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత చైల్డ్ఇన్ఫో వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని తెలిపారు. చైల్డ్‌ఇన్ఫోలో నమోదైన వారిలో ఇప్పటి వరకు పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరవుతున్న వారు ఒక కేటగిరీలో ఉన్నారని చెప్పారు. మరొక కేటగిరీలో పాఠశాలలకు గైర్హాజరవుతున్న విద్యార్థుల పూర్తి వివరాలు సేకరించాలన్నారు. నాడు–నేడు రెండవ దశ పనులను అలసత్వం లేకుండా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది విధిగా నాడు–నేడు పనులను తనిఖీ చేయాలన్నారు. నాడు–నేడు పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జీఈఆర్ లక్ష్యాన్ని వందశాతం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డీఈవో విజయేంద్రరావు, సమగ్రశిక్ష శాఖ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



కలెక్టర్‌తో చర్చిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు కలెక్టరేట్ : గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కోరారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌తో ఉప ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో చేపడుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన పనులు, సీసీ రోడ్లు, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. నిర్మాణంలో ఉన్న సచివాలయ, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతుభరోసా కేంద్రాల భవనాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్‌కు సూచించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పురం జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్నబ్బరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బీరేంద్రవర్మ పాల్గొన్నారు.

పునాదులు ప్రారంభించని ఇళ్ల పట్టాల రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పేదలందరికీ ఇళ్లు పథకంలో మంజూరు చేసిన ఇళ్లల్లో గత నాలుగు నెలలుగా బేస్‌మెంట్ స్థాయిలో కూడా నిర్మాణాలు ప్రారంభించని పట్టాలను రద్దు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఇళ్ల పురోగతిలో బేస్‌మెంట్ కూడా ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులు ఆసక్తి చూపకపోతే పట్టా రద్దు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొంది ఉంటే రికవరీకి చర్యలు చేపట్టాలన్నారు. రద్దు చేసే ఇళ్లను కొత్తగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు కేటాయించాలని ఆదేశించారు. ఈ కసరత్తును ఎంపీడీవో, హౌసింగ్ అధికారులు సమన్వయంతో చేపట్టాలన్నారు. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ప్రతి వారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమంలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముచ్చెమటలు పట్టించిన డ్రోన్



చిత్తూరు అర్బన్: నగరంలో ఓ డ్రోన్ స్థానికులను, పోలీసులకు చెమటలు పట్టించింది. ఈ ఘటనకు సంబంధించి.. చిత్తూరు నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం భూములను రీ–సర్వే చేస్తోంది. భూముల హద్దులను తెలుసుకోవడానికి అధికారులు డ్రోన్ పరికరాన్ని ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం దుర్గానగర్ కాలనీలో ఎగురుతున్న డ్రోన్ ఓ భవనం వద్ద కింద పడిపోయింది. కెమెరా రికార్డింగ్ జరుగుతుండడంతో ఏం జరుగుతుందో తెలియక స్థానికులు ఆందోళన చెంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. టూ టౌన్ పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం ఆ డ్రోన్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చారు. డ్రోన్ ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు పంపించారు? అని పోలీసులు దాదాపు రెండు గంటలపాటు విచారించినా ఫలితం లేదు. కొద్ది సేపటికి తరువాత వార్డు సచివాలయ సిబ్బంది స్టేషన్‌కు వెళ్లి తమదేనంటూ వివరాలను సీఐ మద్దయ్య ఆచారికి చెప్పారు. అధికారులకు డ్రోన్ అప్పగించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

జిల్లాలో 13,790 మందికి చికిత్స



ఐరాల వైద్య శిబిరంలో మందుల పంపిణీ

చిత్తూరు రూరల్ : జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. గురువారం జిల్లాలో 29 చోట్ల శిబిరాలు నిర్వహించారు. ఇందు కోసం పీహెచ్‌సీ వైద్యులు 56 మంది, స్పెషలిస్టు వైద్యులను 71 మందిని విధుల్లోకి తీసుకున్నారు. వీరి ద్వారా ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాలను విజయవంతంగా నిర్వహించారు. శిబిరాలకు 13,790 ఓపీలు వచ్చాయి. అధికంగా మహిళలు శిబిరాలను సద్వినియోగం చేసుకున్నారు. పురుషులు 6,216 మంది వస్తే..స్త్రీలు 7,574 మందికి శిబిరాల్లో చికిత్స చేయించుకున్నారు. జనరల్‌కు 5,442 ఓపీలు, ఓబీజీకి 917, చిన్నపిల్లల ఓపీ 538, ఆర్థోకు 2,241, డెంటల్ 312, చర్మ సంబంధిత సమస్యలకు 442, ఆప్తమాలజీ 2,412, ఇతర సమస్యలకు సంబంధించి 1,486 మంది చికిత్స పొందారు.

వేలంతో రూ.3.2 కోట్ల ఆదాయం



టెండర్లు నిర్వహిస్తున్న ఆలయ అధికారులు, హాజరైన ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి సంబంధించి గురువారం బహిరంగ వేలం నిర్వహించగా రూ.3.20కోట్లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. ఒక ఏడాది కాల వ్యవధికి సీల్డ్ టెండర్, ఆన్‌లైన్ టెండర్ల ద్వారా ఈ వేలం నిర్వహించారు.

- కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే హక్కుకు రూ.36 లక్షలు
- వాహన పూజా సామగ్రి విక్రయించుకునే హక్కుకు రూ.49.10లక్షలు
- పాదరక్షకులు భద్రపరచుకునే హక్కు రూ.25.40లక్షలు
- లగేజీ భద్రపరచుకునే హక్కుకు రూ.23.20లక్షలు
- వినాయక సదన్‌లో క్యాంటీన్ నిర్వహించుకునే హక్కు రూ.18.55లక్షలు
- దుకాణ సముదాయంలో నంబర్ 35 నుంచి 40 వరకు క్యాంటీన్ నిర్వహించుకునేందుకు రూ.37లక్షలు
- నేతి దీపాలు విక్రయించుకునే హక్కుకు రూ.45 లక్షలు
- నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీలు విక్రయించుకునే హక్కుకు(5 నెలల కాల పరిమితి) రూ.20.30లక్షలు
- శివాలయంలో షాపు రూ.15లక్షలు
- కల్యాణ కట్ట ఎదురుగా ఖాళీ స్థలంలో బంకు నిర్వహించుకునే హక్కుకు రూ.12.50 లక్షలు
- దుకాణ సముదాయంలో షాపు నెంబర్ 28, 29లో క్యాంటీన్ నిర్వహించుకునే హక్కుకు రూ.22.10లక్షలు
- మరగదాంబిక కల్యాణం మండపం వద్ద దుకాణానికి రూ.58 వేలు
- శ్రీ విఘ్నేశ్వర కల్యాణ మండపం వద్ద ఖాళీ స్థలంలో దుకాణానికి రూ.15 లక్షలు, మొత్తం రూ.3.20 కోట్ల ఆదాయం

నేడు గుడుపల్లెలో జగనన్నకు చెబుదాం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం శుక్రవారం గుడుపల్లె ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, మండల, గ్రామ స్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. గైర్హాజరైతే శాఖాపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల ప్రజలు సమస్యలను వినతుల రూపంలో పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు.

నేడు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి రాక

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్ శుక్రవారం జిల్లాకు రానున్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేయనున్నారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఉదయం 7.30 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో సుడిగాలి పర్యటన చేసి ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేయనున్నారు. నాడు–నేడు రెండవ దశ పనులు, సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థుల నైపుణ్యాలు, బైజూస్ కంటెంట్ అమలు తీరు, సర్కారు టీచర్ల బోధనా విధానం తదితర అంశాలను పరిశీలించనున్నారు.

నిన్నమొన్నటి వరకు బీడువారిన భూములు నేడు జగనన్న ఇళ్లతో కళకళలాడుతున్నాయి. సకల వసతులతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఇళ్లే కాదు ఊర్లను తలపిస్తున్నాయి. మౌలిక వసతులన్నీ రంగరించుకుని ముస్తాబయ్యాయి. అరటి పిలకలు.. మామిడి తోరణాలతో పండుగ వాతావరణంలో ప్రారంభానికి సిద్ధమయ్యాయి. పేదల ఆనందానికి ఆనవాళ్లుగా.. జగనన్న సంకల్పానికి చిరునామాగా మురిసిపోతున్నాయి. నేడు జిల్లాలో మొట్టమొదటి సారిగా పుంగనూరులో టిడ్కో ఇళ్ల ప్రారంభ నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం..

- సొంతింటి కల నెరవేరుస్తున్న సీఎం వైఎస్ జగన్
- జిల్లాకు 73,584 గృహాలు
- ఇప్పటికే 43,252 ఇళ్లు పూర్తి
- పక్కాగృహాలకు రూ.1,325 కోట్లు
- సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధమవుతున్న లేఔట్లు
- నేడు పుంగనూరులో జిల్లా స్థాయి కార్యక్రమం



మురిసిన ముంగిళ్లు!

సాక్షి, చిత్తూరు: 'ప్రతి ఒక్కరికీ సొంతింటి కల సాకారం కావాలి. పేదలందరూ సొంతిళ్లలో హాయిగా జీవించాలి' అనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు'పథకానికి శ్రీకారం చుట్టారు. దేశంలో ఎక్కడాలేని వి.దంగా రాష్ట్ర వ్యాప్తంగా 30.75 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణానికి రూ.50 వేల కోట్లు వెచ్చించి 21.76 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా 2020–21 ఆర్థిక సంవత్సరానికిగాను చిత్తూరు జిల్లాకు 73,584 గృహాలు మంజూరయ్యాయి. వీటికి రూ.1,325 కోట్లు వెచ్చించారు. ఇప్పటి వరకు రూ.910 కోట్ల వ్యయంతో 68,840 గృహాలు నిర్మిస్తున్నారు. ఇందులో 43,252 గృహాలు పూర్తి చేశారు.



పుంగనూరులో నిర్మించిన టిడ్కో ఇళ్లు

మౌలిక సదుపాయాలు భేష్

జిల్లా వ్యాప్తంగా 512 జగనన్న హౌసింగ్ లేఅవుట్లు ఉన్నాయి. ఈ కాలనీల్లో విద్యుత్, మౌలిక వసతులకు, డిస్కం, రెస్కో వారి ద్వారా తాత్కాలిక, శాశ్వత పనులు చేపట్టారు. మొదటి దశలో రూ.31.49 కోట్లతో తాగునీటి సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. విద్యుద్దీకరణకు సంబంధించి ప్రతి ఇంటికీ ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. ప్రతి ఇంటికీ యూనిట్ విలువ రూ.6 వేలతో సోక్ పిట్‌లు ఏర్పాటు చేశారు.

భారీగా రుణం

గృహ నిర్మాణాలకు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్డీఏ, పట్టణ ప్రాంతాల్లో మెప్మా ద్వారా లబ్ధిదారులకు అవసరమైన రుణ సౌకర్యాన్ని కల్పించింది. జిల్లాలో ఇప్పటి వరకు డీఆర్డీఏ ద్వారా 60,031 మందికి రూ.147 కోట్లు, టిడ్కో గృహాలకు మెప్మా ద్వారా 10,823 మందికి రూ.39 కోట్ల రుణాలు మంజూరు చేశారు.

జిల్లా సమాచారం

నియోజకవర్గం	మంజూరైన గృహాలు	పూర్తయిన గృహాలు
చిత్తూరు	9,717	4,894
కుప్పం	7,898	4,026
జీడీనెల్లూరు	10,407	6,626
నగరి	5,708	3,092
పలమనేరు	13,307-	8,225
పుంగనూరు	15,778	9,504
పూతలపట్టు	10,769-	6,885

జిల్లా ఫస్ట్

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం అమలులో రాష్ట్ర స్థాయిలో చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఇప్పటికే 43,252 ఇళ్లు పూర్తయ్యాయి. ఇందులో బీబీఎల్‌లో 3,494, బీఎల్ 12,113, ఆర్‌ఎల్ 6,225, ఆర్సీ కింద 3,756 ఉన్నాయి. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన 5,55,475 మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా అందించారు. సిమెంట్, స్టీలును అందుబాటులో ఉంచారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



పుంగనూరులో15 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. నా భర్త బార్బర్. వచ్చే సంపాదనతో ఇంటి అద్దెకు, కుటుంబ అవసరాలకు చాలా ఇబ్బందులు ఎదుర్కొనే వాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత పుంగనూరు గూడూరుపల్లె హౌసింగ్ లేఔట్‌లో ఇల్లు వచ్చింది. ఇంటి నిర్మాణానికి 80 బస్తాల సిమెంట్ ఇచ్చారు. ఇప్పటివరకు రూ.1.4 లక్షల బిల్లు అందింది. శ్రీమంజునాథ డ్వాక్రా సంఘంలో రుణం తీసుకుని ఇంటిని నిర్మించుకున్నాను. చాలా సంతోషంగా ఉంది. జగనన్నకు రుణపడి ఉంటాను.

-లావణ్యకుమారి, గూడూరుపల్లె, పుంగనూరు

సొంతింటి కల నెరవేరింది



మేము 25 సంవత్సరాలుగా పుంగనూరు సంతగేటు వద్ద అద్దె ఇంట్లో నివాసమున్నాం. నా భర్త కూలి పనికి వెళ్లి మమ్మల్ని పోషిస్తున్నాడు. ముగ్గురు పిల్లలు ఉన్నారు. సొంత ఇల్లు లేక.. అద్దె కట్టలేక చాలా ఇబ్బందులు పడ్డాం. ఇలాంటి పరిస్థితుల్లో మాకు టిడ్కో ఇల్లు మంజూరైంది. ఒక్క రూపాయి చెల్లించుకుని మాకు ఇల్లు మంజూరు చేశారు. సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రి జగనన్నకు, మంత్రి పెద్దిరెడ్డికి కృతజ్ఞతలు.

- రత్నమ్మ, పుంగనూరు (టిడ్కో లబ్ధిదారురాలు)

ఆడపడుచుకు ఆస్తిగా ఇచ్చారు



నా భర్త కూలి పనికెళ్తాడు. మేము పుంగనూరు తూర్పు మొగశాలలో అద్దె ఇంట్లో ఉంటున్నాం. నెలకు అద్దె రూ.5 వేలు చెల్లిస్తున్నాం. నేను టైలరింగ్ పనిచేస్తున్నాను. జగనన్న ప్రభుత్వం వచ్చాక పుంగనూరు గూడూరుపల్లెలో ఇల్లు మంజూరు చేశారు. ఇప్పుడు నేను సొంత ఇంట్లో ఆనందంగా ఉంటున్నాను.

- ముంతాజ్, గూడూరుపల్లె, పుంగనూరు

మాటంటే మాటే



పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని పాదయాత్రలో వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నేడు సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం అవుతున్నారు. జగనన్న కాలనీలలో పండుగ వాతావరణం నెలకొంది. పేదల కలను సాకారం చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఎప్పటికీ వారి మదిలో నిలిచి ఉంటారు.

-పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర మంత్రి

జిల్లాలో 43 వేల ఇళ్లు పూర్తి



రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంతింటిని నిర్మించి ఇచ్చి వారి జీవితాల్లో వెలుగును నింపుతోంది. సొంతింటి నిర్మాణ కలను సాకారం చేస్తోంది. గుడిసెల్లో నివసిస్తున్న వారు నేడు సొంత ఇంటికి యజమానులు కానున్నారు. వారి కళ్లల్లో ఆనందం వెల్లి విరుస్తోంది. జిల్లాలో దాదాపు 73 వేల గృహాలు మంజూరవగా.. అందులో దాదాపు 43 వేల ఇళ్లు పూర్తిచేశాం.

- సగిలి షణ్మోహన్, కలెక్టర్


రూ.99.49 కోట్లతో టిడ్కో ఇళ్లు

నవరత్నాలు పేదలందరికీ ఇల్లు మహోన్నత కార్యక్రమంలో నేను భాగస్వామ్యం అయినందుకు సంతోషంగా ఉంది. జిల్లా కలెక్టర్ సహాయ సహకారాలు, సూచనల మేరకు ఇళ్ల పురోగతిని సాధించాం. రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిపాం. పుంగనూరు గూడూరుపల్లెలో రూ.99.49 కోట్లతో 1,536 టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందజేస్తున్నాం. నిర్మాణాల్లో లబ్ధిదారులు కూడా బాగా సహకరించారు.

- పద్మనాభం, హౌసింగ్ పీడీ

ఇన్‌స్పైర్‌లో 'మూర్తి' భవించిన సృజన

- జాతీయస్థాయిలో జిల్లా పేరు నిలబెట్టిన మూర్తిచేతన్
- తక్కువ రసాయనాలతో స్ప్రేచేసే యంత్ర ప్రయోగానికి అవార్డు



తాను తయారు చేసిన యంత్రంతో మూర్తిచేతన్

పలమనేరు: ఢిల్లీలో జరిగిన పదో జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన విద్యార్థి మూర్తి చేతన్ అవార్డును దక్కించుకుని పేరునిలబెట్టాడు. జాతీయ స్థాయిలో మొత్తం 441 ప్రాజెక్టులను ఢిల్లీలో ప్రదర్శించగా, ఇందులో ఏపీ నుంచి 30 ఉన్నాయి. నాలుగు స్థానాలను మన రాష్ట్రం కైవసం చేసుకుంది. వీటిల్లో చిత్తూరు, అనంతపురం, గుంటూరు,ప్రకాశం జిల్లాలకు చెందిన ఒక్కో ప్రాజెక్టుకు అవార్డు దక్కింది. జిల్లా సైన్స్ అధికారి రమణ(పలమనేరు) గురువారం వివరాలు వెల్లడించారు. ఢిల్లీలో మూడు రోజుల కిందట జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుల పోటీలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలోని తిరుపతి భారతీయ విద్యాభవన్ ఎస్వీ విద్యాలయ పాఠశాలకు చెందిన మూర్తిచేతన్ ప్రదర్శించిన తక్కువ మోతాదులో రసాయనిక ఎరువులను పిచికారీ చేసే యంత్రం ప్రయోగానికి అవార్డు దక్కింది. భూమిలో రసాయనిక ఎరువులను ఎక్కువగా వినియోగించడం ద్వారా యూట్రోఫికేషన్, మట్టి సారం కోల్పోవడం, ఈ పంట ఉత్పత్తుల ఉపయోగిస్తే సంతోనోత్పత్తి క్షీణించడం లాంటి సమస్యలున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు చేతన్ ఓప్లాస్టిక్ డబ్బా, వాల్వ్, రెండు స్ప్రాకెట్లు, ఓ హ్యాండిల్, సైకిల్ చైన్, బెల్ట్, రాడ్‌ల సాయంతో తక్కువ ఖర్చుతో మందుల పిచికారీ యంత్రాన్ని రూపొందించాడు. తద్వారా స్ప్రాకెట్‌ను తప్పినపుడు డబ్బాలో వత్తిడి పెరిగి తక్కువ మోతాదులో క్రిమి సంహారక మందులు మొక్కలకు చేరతాయి. దీంతో రసాయనాల మోతాదును తగ్గించవచ్చనే ప్రయోగం న్యాయ నిర్ణేతలను మెప్పించింది. ఈ విద్యార్థికి గైడ్ టీచర్‌గా వ్యవహరించిన గంగాధరనెల్లూరు మండలం మురళిని సైతం జిల్లా విద్యాశాఖ అభినందించింది. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రయోగాన్ని చేసిన మూర్తి చేతన్ కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్, ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ అధ్యక్షురాలు డాక్టర్ నమితాగుప్తత, కార్యదర్శిఅభయ్‌కరణ్, చీఫ్ ఇన్ననేటివ్ ఆఫీసర్ డాక్టర్ విపిన్‌కుమార్‌ల నుంచి ఈ అవార్డును ఢిల్లీలో అందుకున్నారు. ఈ విద్యార్థిని స్థానిక ఉమ్మడి చిత్తూరు జిల్లా డీఈవోలు విజయేంద్రరావు, శేఖర్, సమగ్రశిక్ష పీడీ వెంకటరమణారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రమణ అభినందించారు.

జిల్లా సైక్లింగ్ జట్ల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పూతలపట్టు: జిల్లా స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సైక్లింగ్ అండర్–17, అండర్–14 బాలబాలికల జట్ల ఎంపికను పూతలపట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలకు గురువారం ఉమ్మడి జిల్లాల నుంచి 150 మంది హాజరయ్యారు. ఎంపికైన వారిలో అండర్ –17 విభాగంలో దేవిశ్రీప్రసాద్, లోకేష్, కుషల్ కుమార్, శశిధర్, తేజశ్రీ, నాగకీర్తన, పవిత్ర, దీక్షిత అండర్–14 విభాగంలో జశ్వంత్, సంజయ్, అరుణ్, చిట్టిప్రసాద్, లక్ష్మి, సోనియా, వర్షిత, ఆయేషా ఎంపికైనట్లు పీటీ.కృష్ణ, ఢిల్లీరాణి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నవంబర్‌లో గుంటూరు జిల్లా బాపట్లలో రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ రవీంద్రరెడ్డి, చౌదరి, వాణి, గురుప్రసాద్, వసంతవాణి, సునీత, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో మెరిసిన ఆకాష్



బహుమతి అందుకుంటున్న ఆకాష్

చిత్తూరు కలెక్టరేట్ : ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి మిల్లెట్స్ సైన్స్ సెమినార్‌లో చిత్తూరు విద్యార్థి ప్రతిభ చాటాడు. ఈనెల 12వ తేదీన ఢిల్లీలో చిరుధాన్యాలు మంచి పోషకాహారం అనే అంశంపై జాతీయ స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు చిత్తూరు జిల్లా తరుపున జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థి ఆకాష్ పాల్గొన్నాడు. ఆ సెమినార్‌లో సర్కారు బడిలో చదువుతున్న ఆకాష్ ప్రతిభ చాటి జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నాడు. మెమెంటో, ప్రశంసాపత్రం అందుకున్నాడు. విద్యార్థి ఆకాష్‌ను, శిక్షణ ఇచ్చిన గైడ్ టీచర్‌లు హేమాద్రి, విజయలక్ష్మిని ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి, డీఈవో విజయేంద్రరావు, సమగ్రశిక్ష శాఖ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, డీవైఈవో చంద్రశేఖర్, సైన్స్ ఆఫీసర్ వెంకటరమణ అభినందించారు.

మతిస్థిమితం లేని యువతిపై లైంగికదాడికి యత్నం

కుప్పం: మండల పరిధిలోని వెండుగంపల్లెలో మతిస్థిమితంలేని యవతిపై మద్యం మత్తులో వృద్ధుడు ఆత్యాచారయత్నం చేసిన సంఘటన అలస్యంగా వెలుగులోకి వచ్చింది.పోలీసుల కథనం మేరకు వివరాలు.. వెండుగంపల్లెకు 24 ఏళ్ల మతిస్థిమితం లేని యువతి ఆదివారం ఇంట్లో ఒంటరిగా ఉంది. తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. ఈ సమయంలో అదే గ్రామానికి చెందిన మునెప్ప(65) ఆత్యాచారయత్నం చేశాడు. యువతి కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్నవారు వృద్ధుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు అర్బన్ ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్: సర్వర్ సమస్య తీరడంతో శుక్రవారం నుంచి యథావిధిగా రేషన్‌పంపిణీ జరుగుతుందని డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. సర్వర్ సమస్య తలెత్తడంతో మూడు రోజులుగా ఆఫ్‌లైన్ విధానం ద్వారా రేషన్ అందజేశామన్నారు. ఇకపై పాత పద్ధతిలో రేషన్ పంపిణీ జరుగుతుందని తెలిపారు. కార్డుదారులు ఈ విషయాన్ని గమనించి సరుకులు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

జిల్లాకు పీఓఎస్ మిషన్లు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాకు 145 పీఓఎస్ మిషన్లు వచ్చినట్లు డీపీఓ లక్ష్మి తెలిపారు. వీటి ద్వారా పల్లెలో పన్నుల వసూలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మూడు వేలు అంతకు మించి జనాభా ఉన్న ప్రాంతాల్లో వీటి ద్వారా వసూలు చేస్తారన్నారు. ఆయా గ్రామాల వారీగా ఇంటి యజమాని వివరాలు, ఇంటి విస్తీర్ణం, భవన నిర్మాణ తీరు ఆధారంగా నిర్ధారించిన పన్నుల వివరాలన్నీ మిషన్లతో అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు.